కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి. టమోటా రూ.15, వంకాయ రూ.23, బెండకాయ రూ.45, పచ్చి మిర్చి రూ.25, బజ్జి మిర్చి రూ.20, కాకరకాయ రూ.31, బీరకాయ రూ.55, క్యాబేజీ రూ.19, బీన్స్ రూ.50, క్యారెట్ రూ.37, గోబి పువ్వు రూ.30, దొండకాయ రూ.40, చిక్కుడు కాయ రూ.40, గోరు చిక్కుడు రూ.28, బీట్‌రూట్ రూ.35, క్యాప్సికం రూ.55, ఆలుగడ్డ రూ.33, కీర రూ.32, దోసకాయ రూ.16, సొరకాయ రూ.20, పొట్లకాయ రూ.22, కంద రూ.55, ఉల్లిపొరక రూ.40, ఉల్లిగడ్డ రూ.49, మామిడి కాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.35, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.35, గుమ్మడి కాయ రూ.40, నిమ్మకాయలు రూ.30-40, మునగ కాయలు రూ.18-20, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.400, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.40, కరివేపాకు రూ.100, పర్వల్ రూ.55, పల్లికాయ రూ.60, లోబా రూ.25, ఆ కాకరకాయ రూ.60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు జీహెచ్‌ఎంసీలో ప్రజావాణి

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంతో పాటు కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి ఉంటుంది. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, పారిశుధ్యం, దోమలు, వీధి దీపాలు ఇతరత్రా సమస్యలపై జడ్సీ, డీసీలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి సమాధానం కోరవచ్చు. సర్కిళ్ల పరిధిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోతే వాటి గురించి జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.


రమ్యగ్రౌండ్ వద్ద వైద్య శిబిరంలో పరీక్షలకు వచ్చిన ప్రజలు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీలోని శ్రీ మంజు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం రమ్య గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. శిబిరానికి వచ్చిన 138 మందికి బీపీ, షుగర్, ఇతరత్రా సాధారణ పరీక్షలు చేశారు. జనరల్ ఫిజిషియన్ డా.అజిత్‌కుమార్ అజాత్, డా. అజయ్ సూచనలు, సలహాలు ఇచ్చారు. వ్యాయామం, మెడిటేషన్ వంటివి చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఏడాదికి ఓసారి అయినా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సలహాల మేరకు మెడిషిన్ వాడితే మంచిదన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ స్టాఫ్ రవీందర్, శ్రీరాం, రసన్య మౌనిక తదితరులు పాల్గొన్నారు.


శబరిమలై వెళ్లే ముందు కనకదుర్గ ఆలయంలో స్వాముల పూజలు

శబరిమలై బయలు దేరిన స్వాములు

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-2 లోని కనకదుర్గ ఆలయ ప్రాంగణంలో ఆదివారం గురుస్వామి శివరామ కృష్ణయ్య 40 మంది అయ్యప్ప స్వాములకు ఇరుముడి కట్టారు. శబరిమలై వెళ్తున్న నేపథ్యంలో అయ్యప్ప స్వాముల కుటుంబ సభ్యులు, బంధమిత్రులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పోచిరెడ్డి కొండారెడ్డి తొలిసారి మాల ధరించిన కన్నె స్వాములతో పాటు ఇతర స్వాములకు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఇరుముడి కట్టుకొని స్వామియే శరణం అయ్యప్ప అంటూ శబరిమలై బయలుదేరి వెళ్లారు.


టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఔత్సాహికులు

టీడీపీకి పూర్వ వైభవం తెస్తాం: కొడాలి రవి

హైదర్‌నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేట రోడ్డులో ఆదివారం ఉదయం టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఆ పార్టీ నేత కొడాలి రవి కుమార్ ఆధ్వర్యంలో సాయి గణేష్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో పలువురు సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో అల్లు రాధాకృష్ణ, మేక శ్రీధర్, వెంకటేశ్వర రావు, కడియాల శివ, ఎస్వీ రావు, రాము, బ్రహ్మం, చిన్ని, రమేష్, అప్పారావు, శ్రీనివాస్, సుబ్బారావు, సరస్వతి పాల్గొన్నారు.

యాసిడ్ తాగి యువకుడి ఆత్మహత్య

బిట్స్‌పిలానీ, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఈ విషాద ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బీజేఆర్ నగర్, జమ్మిగడ్డలో వెంకటేశ్ భార్య, ముగ్గురు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇతని పెద్ద కుమారుడు సాయికృష్ణ(18) తన చిన్న తమ్ముడు రాకేష్‌తో సెల్‌ఫోన్ విషయమై గొడవపడ్డాడు. ఇది తెలిసి తండ్రి ఏ పనీ చేయకుండా ఇంట్లో తిని కూర్చుంటూ గొడవకు దిగుతున్నవా' అని పెద్ద కుమారుడిని మందలిచ్చాడు. దీంతో మనస్తాపం చెందిన సాయికృష్ణ శనివారం సాయంత్రం ఇంట్లో బాత్రూమ్‌ను క్లీనింగ్ చేసే యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే దగ్గరలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

గచ్చిబౌలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ఆదివారం శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ప్రజాప్రతినిధులతో కలిసి ఆయనతో సమావేశమైయ్యారు. పార్టీ బలోపేతానికి పూర్తి సహకారం ఉంటుందని, పూర్వవైభవం తీసుకుచ్చేందుకు కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు. నాయకులు నరేష్ అజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పైసలిస్తేనే పనులు..

ఫిర్యాదులు బుట్ట దాఖలు

● టౌన్ ప్లానింగ్ అధికారుల చేతివాటం

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అక్రమ కట్టడాలను కట్టడి చేయాల్సిన అధికారులు పైసల కోసం ఎంతకైనా తెగిస్తున్నారు. ప్రజావాణిలో అసోసియేషన్ లేదా స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు చేసే ఫిర్యాదులను ఏమాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదు. ఎంత ముట్టజెప్పారన్నదాన్ని బట్టి దానిపైన చర్యలు తీసుకోవాలా లేదా అన్నది నిర్ణయిస్తారట. జీహెచ్‌ఎంసీ మూసాపేట్ సర్కిల్‌లో ఇప్పుడు ఇదే హాట్‌టాపిక్‌గా నడుస్తోంది.


వసంతనగర్‌లో నోటీసులు ఇచ్చినా పూర్తయిన భవనం

అధికారుల తీరుపై విమర్శలు

మూసాపేట్ సర్కిల్‌లో ప్రస్తుతం విచిత్రమైన మాటలు విన్పిస్తున్నాయి. రెండు నెలలుగా డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ ఇలా ఎవర్ని కదిలించినా మేము కొత్తగా వచ్చాం మీరు రాసి ఇవ్వండి చూస్తాం అనడం తప్ప పరిష్కారం వైపు ఏ మాత్రం పనిచేయడం లేదన్న విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయి. సర్కిల్‌పరిధిలో కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, మూసాపేట్, అల్లాపూర్, ఫతేనగర్ డివిజన్లు ఉండగా.. ఎక్కడ ఎటువంటి నిర్మాణం చేపట్టాలన్నా ముందుగా టౌన్‌ప్లానింగ్ అధికారులు అడిగినంత ముట్టజెప్పితే సరే.. లేదంటే రాజకీయ నాయకుడు అయినా ప్రజాప్రతినిధి అయినా డోంట్ కేర్ అంటూ టీపీఎస్ కూల్చివేతలకు ఏ మాత్రం వెనకాడటం లేదంటున్నారు. గతంలో ఉన్న అధికారికి ఇచ్చుకున్నాం అని చెప్పినా అవునా సరేలే అంటూ కాస్త చిరాగ్గా మొహం పెట్టుకొని వెళ్లడం. తర్వాత తన పని ఎలా ఉంటుందో నోటీసు లేదా సీజ్ చేసేందుకు సిఫారసు చేస్తూ భవన నిర్మాణ దారులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఎన్ని సార్లు కలిసి విన్నవించినా చూస్తాం.. చేస్తాం అనడం తప్ప క్షేత్ర స్థాయిలో పరిశీలనకు వచ్చి నిర్మాణాలను ఆపే నాథుడే కరవయ్యారని వసంతనగర్ సొసైటీ డైరెక్టర్ అనిల్‌కుమార్ వర్మ ఆవేదన వ్యక్తం చేశాడు.

ఎమ్మెల్యే పిర్యాదు బేఖాతార్

మూసాపేట్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ సూపర్ వైజర్‌గా గత నెలలో బాధ్యతలు తీసుకున్న ఆమె ఇప్పుడు డబ్బుల కోసం ఎంతకైనా తెగిస్తుందన్న విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయి. అడిగినంత ముట్టజెబితే చాలు సీజ్ చేసిన భవనాల్లో యథేచ్ఛగా పనులు చేసుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ అవినీతికి పాలుపడుతుందని విమర్శలు ఉన్నాయి. ఇదే విషయమై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు టౌన్‌ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 12న జడ్సీ అపూర్వ్ చౌహాన్‌కు ఫిర్యాదు చేశారు. నా దగ్గర ఆమె డబ్బులు తీసుకున్నట్లు సాక్ష్యాలు ఉన్నాయని, ఏం చర్యలు తీసుకుంటారో తీసుకోండని ఎమ్మెల్యే గట్టిగానే అధికారులను నిలదీయడంతో ఏం చేయాలో అర్థం కాక మౌనం వహించారట. అవినీతి ఏ మేరకు ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ప్రశాంతంగా గ్రూపు-2 పరీక్షలు ప్రారంభం



గీతాంజలి డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రం వద్ద నంబర్ వెతుక్కుంటున్న అభ్యర్థులు, కూకట్‌పల్లిలో పరీక్ష రాయడానికి వచ్చిన యువతులు

బాలానగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన గ్రూప్-2 పరీక్షా కేంద్రాలలో ఆదివారం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. బాలానగర్‌లోని సెయింట్ మార్టిన్ హైస్కూల్, ఏపీహెచ్‌బీ కాలనీలోని గీతాంజలి డిగ్రీ కళాశాల, పాపయ్య యాదవ్‌నగర్ రెయిన్‌బో ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కాలేజ్, రెయిన్‌బో ఇంటిగ్రేటెడ్ జూనియర్ కాలేజీలో ఈ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరిగాయి. సెయింట్ మార్టిన్ స్కూల్(కోడ్ -5106)లో 912 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 418, రెయిన్‌బో ఇంటిగ్రేటెడ్ జూనియర్ కళాశాల (కోడ్-5213)లో 720 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 323 మంది, రెయిన్‌బో ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కళాశాల(కోడ్ -5212)లో 720 పరీక్ష రాయాల్సి ఉండగా 329 మంది, గీతాంజలి డిగ్రీ కళాశాల(5206)లో 576 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 242 మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. బాలానగర్ ఏసీపీ హనుమంతరావు పర్యవేక్షణలో, బాలానగర్ సీఐ టి.నర్సింహరాజు నేతృత్వంలో ఎస్సైలు సుభాష్, యం.డి హాజీమియా, ఉమన్ ఎస్సై సరళపరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు సెంటర్ల వద్ద పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేశారు.


పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న బాలానగర్ సీఐ నర్సింహ రాజు

కూకట్‌పల్లిలో...

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష తొలిరోజు ప్రశాంతంగా ముగిసింది. ఉదయం పరీక్షకు 8247 మందికి గాను 3844, మధ్యాహ్నం 8247 మందికి గాను 3389 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, ప్రతిభ డిగ్రీ కాలేజ్, ప్రగతి డిగ్రీ కాలేజ్, వివేకానంద డిగ్రీ కాలేజ్, శ్రీచైతన్య స్కూల్, నారాయణ హైస్కూల్స్ వద్ద పరీక్ష రాసేవారితో పాటు వారి వెంట వచ్చిన వారితో సందడి వాతావరణం నెలకొంది. కూకట్‌పల్లి పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి ఆలయాల్లో

ధనుర్మాస పూజలు

బాలానగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస పూజలు ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకు జరగనున్నాయి. నెల రోజులు ఆలయాల్లో పండుగ వాతావరణం నెలకొననుంది. విష్ణుమూర్తికి ప్రీతికరమైన మాసం కావడంతో వైష్ణవులు ధనుర్మాస వ్రతం, పూజలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ మాసంలో హరిదాసు కీర్తనలు, జంగమ దేవరలు, గంగిరెద్దులను ఆడించే వారితో సందడిగా మారనుంది. ముంగిళ్లలో ముత్యాల ముగ్గులు కనువిందు చేయనున్నాయి.


ధనుర్మాస పూజల కోసం ముస్తాబైన బాలానగర్ వెంకటేశ్వర ఆలయం

పూజలకు ఆలయాలు ముస్తాబు...

ధనుర్మాస పూజల కోసం ఆలయాలు ముస్తాబయ్యాయి. బాలానగర్ వినాయకనగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయం, కల్యాణ్‌నగర్‌లోని సాయినాగేంద్ర ఆలయం, ఫతేనగర్ డివిజన్‌లోని హరిహరాక్షేత్రం, ఓల్డుబోయినపల్లి సర్వధామనగర్‌లోని వేంకటేశ్వర ఆలయం, కేపీహెచ్‌బీ కాలనీలోని వెంకటేశ్వర ఆలయం, కూకట్‌పల్లిలోని రామాలయం, ప్రశాంత్‌నగర్‌లోని శ్రీవారం ఆలయంలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. సోమవారం ఉదయం నుంచి భక్తుల ఆలయాలకు వచ్చి పూజలు నిర్వహించే అవకాశం ఉండడంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగక కుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

ఈ మాసంలో పెళ్లీడు అమ్మాయిలు ఇంటిముందు ముగ్గులు వేసి రంగులతో అలంకరించి తిరుప్పావై కీర్తనలతో స్వామి వారిని కొలిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. అమ్మాయిలే కాదు భక్తులందరు పూజలు చేస్తే మహాలక్ష్మి కటాక్షం లభిస్తుంది.

హిందూ ధర్మరక్షణకు యువత నడుంబిగించాలి



త్రిశూల్ దీక్ష ప్రతిజ్ఞలో ప్రసంగిస్తున్న కాశ్మీర్‌ఫైల్స్ సినిమా నిర్మాత అభిషేక్ అగర్వాల్, సరూర్‌నగర్ వీధుల్లో పదసంచాలన్ చేస్తున్న భజరంగ్‌దళ్ కార్యకర్తలు

● కాశ్మీర్ ఫైల్స్ చిత్ర నిర్మాత అభిషేక్ అగర్వాల్

ఎల్‌బీనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మరక్షణ కోసం యువత నడుంబిగించాలని కాశ్మీర్ ఫైల్స్ చిత్ర నిర్మాత అభిషేక్ అగర్వాల్ పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ వివేకానంద జిల్లా బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో త్రిశూల్ దీక్ష కార్యక్రమాన్ని ఆదివారం సరూర్‌నగర్ మండల మైదానంలో నిర్వహించారు. అంతకుముందు సరూర్‌నగర్ మండల మైదానం నుంచి బజరంగ్‌దళ్ కార్యకర్తల పదసంచాలన్ ప్రారంభమై మహాలక్ష్మి ఆలయం చౌరస్తా మీదుగా గాంధీబొమ్మ, సరూర్‌నగర్ చౌడీ మీదుగా సరూర్‌నగర్ మండల మైదానం వరకు సాగింది. అనంతరం జరిగిన సభలో అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం కాదు మన హిందూ ధర్మ రక్షణ కోసం ఉద్యమించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. హిందూ ధర్మ రక్షణ కోసం యువత ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యంజీ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన 75 సంవత్సరాలలో దేశంలో మెజారిటీగా ఉన్న హిందువుల జనాభ తగ్గుతూ వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మరో 25 సంవత్సరాలలో హిందువులు మైనారిటీలుగా మారే ప్రమాదం పొంచి ఉన్నదన్నారు. విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ మాట్లాడుతూ మొఘలులను తరిమికొట్టి దేశంలో భగవ ధ్వజాన్ని రెపరెలాడేలా చేసినటువంటి చరిత్ర మనకు ఆదర్శం కావాలన్నారు. భారతదేశం, సనాతన ధర్మం ఏ సవాళ్లను ఎదుర్కుంటుందో వాటికి పరిష్కారం చూపెట్టాల్సినటువంటి గురుతర బాధ్యత మనపై ఉందన్నారు.

దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో అక్రమంగా తిష్టవేసిన బంగ్లాదేశ్ చొరబాటుదారులను వెతికి పట్టుకుని తిప్పిపంపాలని పోలీసులను కోరారు. అక్రమ చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తున్న దేశద్రోహులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సభలో బజరంగ్‌దళ్ తెలంగాణ ప్రాంత కన్వీనర్ శివరాములు, విశ్వహిందూ పరిషత్ భాగ్యలక్ష్మి విభాగ్ ప్రముఖ్ కళ్లెం రాజేందర్‌రెడ్డి, సంఘటన మంత్రి సాయిరాంజీ, వివేకానంద జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, జిల్లా కార్యదర్శి సుధాకర్, జిల్లా బజరంగ్‌దళ్ సంయోజక్ నవారు రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ గాలిగోపుర నిర్మాణానికి శంకుస్థాపన

మియాపూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయ రాజగోపురం నిర్మాణం, ఆలయ అర్చకుల వసతి గృహ నిర్మాణ పనులకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ శంకస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని, నాణ్యమైన నిర్మాణం చేపట్టాలన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, బాలింగ్ గౌతమ్‌గౌడ్ దేవాలయ కమిటీ అధ్యక్షుడు రాధాకృష్ణగౌడ్, సభ్యులు తులసీదాస్, రాజేందర్, రవికుమార్, భగత్,శ్రవణ్, గోపి,శ్రీధర్, దూవల్ యాదవ్, ప్రమోద్ కుమార్, దాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గాంధీ అందించిన ఎల్‌ఓసీలను చూపిస్తున్న బాధితులు

రూ.24.12 లక్షల ఎల్‌ఓసీల అందజేత

హైదర్ నగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్సల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా, 60 మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.24,12,500 విలువ గల ఆర్థిక సాహాయానికి సంబంధించిన 'లెటర్ ఆఫ్ క్రెడిట్'ని కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి బాధితులకు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అందజేశారు. కార్యక్రమంలో సంజీవ రెడ్డి, ఉట్ల కృష్ణ, రామకృష్ణ గౌడ్, పురేందర్ రెడ్డి, కాశీనాథ్, చిరుమూర్తి, సుబ్బయ్య, శేఖర్, నర్సయ్య పాల్గొన్నారు.


సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ కార్యకర్తలు

సర్దార్ పటేల్‌కు నివాళి

అల్లాపూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 74వ వర్ధంతిని అల్లాపూర్ డివిజన్‌లో ఆదివారం జరుపుకున్నారు. బీజేపీ నేత సి.వెంకట్‌రామి రెడ్డి ఆధ్వర్యంలో గాయత్రీనగర్ కూడలిలో జరిగిన కార్యక్రమంలో సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ మోతీనగర్, అల్లాపూర్ డివిజన్ బీజేపీ నాయకులు రవి యాదవ్, మనోజ్, జితేందర్, సంతోష్, సదాశివుడు, ఠాకుర్, శ్రీనివాసులు, విజయ్, నాగరాజ్ పాల్గొన్నారు.


అయ్యప్ప గురుస్వామితో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

అయ్యప్ప పడిపూజలో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, డిసెంబర్ 15(ఆంధ్రజ్యోతి): బాలానగర్‌కు చెందిన బొడ్డు కోటేశ్వర్‌రావు గురుస్వామి ఆధ్వర్యంలో మాధవీనగర్‌లో జరిగిన అయ్యప్పపడి పూజల్లో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. అయ్యప్ప భక్తులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వాములు కార్పొరేటర్‌ను శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


బాలుడి తండ్రికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

అధికారుల నిర్లక్ష్యమే బాలుడి ప్రాణాన్ని బలిగొంది

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఫతేనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ ఇందిరాగాంధీపురం నాలాలో పడి గల్లంతై మృతి చెందిన బాలుడి తల్లి తండ్రులు, కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం ఉదయం కార్పొరేటర్లు పండాల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. అంత్య క్రియల నిమిత్తం రూ. 20 వేల ఆర్థిక సాయాన్ని బాలుడి తల్లి తండ్రులకు అందజేశారు. ఏదైన అవసరం ఉంటే తనను సంప్రదించాలని బాలుడి తల్లి తండ్రులకు ధైర్యం చెప్పారు.

అధికారుల నిర్లక్ష్యమే...

బాలుడి మృతికి కారణాలు, సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యం ఓ బాలుడి నిండు ప్రాణాన్ని బలిగొందని అన్నారు. గోడ విషయమై గతంతో ఎన్నో సార్లు అధికారులకు చెప్పానని, అప్పుడు వారు స్పందించలేదని బాలుడు చనిపోయిన ప్రజలు తిరుగబడతారనే భయంతో రాత్రికి రాత్రే గోడ కట్టారని, ఈ గోడను ఆరునెలల ముందు నిర్మించి ఉంటే బాలుడు దక్కే వాడని తన ఆవేదనను వ్యక్తం చేశారు. సంఘటనకు బాధ్యులను చేస్తూ మున్సిపల్ కమిషనర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌పై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, నాయకులు, నివాసితులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

భారతీయులకు రాజ్యాంగమే స్ఫూర్తి

● సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

రాంనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతీయులు విశ్వమానవులని, వారిని ఒక్కటిగా ఉంచగలిగింది మన రాజ్యాంగమేనని, దానిని కాపాడుకోవడం భారతీయుల తక్షణ కర్తవ్యమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకుడు అక్షయకుమార్‌దత్ సంస్మరణ సభ టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. లౌకికవాది, మానవతావాది, సమతావాది, కులం, మతం, ప్రాంతానికి అతీతంగా సమానత్వం కోరుకున్న వారు విశ్వమానవులన్నారు. ఆ కోవకు చెందిన వ్యక్తి అక్షయ్‌కుమార్ దత్ అన్నారు. మన అస్తిత్వం, భారతీయత, భారతీయులందకీ సమానమైన హక్కులు ఉండాలన్నారు. అమెరికాలాంటి పెట్టుబడి దేశంలో అమలవుతున్న పౌరసత్వ ప్రాతిపదిక సవరణ చట్టం చేయబోతున్నారని ఆరోపించారు. రాజ్యాంగంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయన్నారు. కాంగ్రెస్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడితే.. బీజేపీ రాజ్యాంగాన్ని విధ్వంసం చేస్తోందని ఆరోపించారు. ప్రపంచంలో ఎలక్ట్రోల్ డిక్టేటర్‌షిప్ అనే కొత్త సంస్కృతి తెరపైకి వచ్చిందని అది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక కూడా నియంతృత్వానికి దారి తీస్తుందన్నారు. లౌకికవాదం, సమాఖ్యవాదం, సామాజిక న్యాయం, సామ్యవాదం కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మతం వ్యక్తిగతం అని రాజ్యం జోక్యం ఉండకూడదన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారి వ్యవస్థ పట్ల వ్యతిరేకత పెరిగి సామ్యవాద భావనకు మద్దతు పెరుగుతోందన్నారు.

కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య, నాయకులు మాణిక్‌రెడ్డి, నరహరి, కమలాకుమారి, సింహాచలం, కొండల్‌రావు, పౌరస్పందన వేదిక కార్యదర్శి రాధేశ్యామ్, పద్మశ్రీ, కె.జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం


వృద్ధులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మియాపూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ పరిధిలో గల వివేకానంద సేవా సంఘం వృద్ధుల ఆశ్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. చందానగర్ మెడికవర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు వృద్ధులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. జనరల్ ఫిజీషియన్లు అక్షయ్ కుమార్, అనూషలు మాట్లాడుతూ, మారుతున్న జీవనశైలిలో పర్యావరణంలో వస్తున్న మార్పులవల్ల ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారన్నారు. సంపూర్ణ ఆరోగ్యం ఉండాలనేది మనచేతల్లోనే ఉందన్నారు. ఆహారపు అలవాట్లు, వ్యాయామం, నడక వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని పేర్కొన్నారు. సాధ్యమైనంత వరకు తాజా ఆకుకూరలు, పండ్లు, చిరు ధాన్యాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు సుందర ప్రసాద్, సంఘ సేవకులు వెంకట్, అసోసియేషన్ ప్రతినిధులు పాలం శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాదాపు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.


హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డిని కలిసిన మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, తదితరులు

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

గచ్చిబౌలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ఆదివారం శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ప్రజాప్రతినిధులతో కలిసి ఆయనతో సమావేశమయ్యారు. పార్టీ బలోపేతానికి పూర్తి సహకారం ఉంటుందని, పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు. నాయకులు నరేష్ అజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


గురునాథం చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి

చెరువుల పరిరక్షణకు చర్యలు

- కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ పరిధిలో చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. డివిజన్ పరిధిలోని గురునాథం చెరువుకు నెక్సస్ సెలెక్ట్ మాల్స్ సంస్థ సహకారంతో మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సుందరీకరణ పనులను నిర్వాహకులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురునాథం చెరువు రక్షణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని, శాశ్వత పరిష్కారం దిశగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. చెరువు నీరు కాలుష్యం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మురికి కూపంగా ఉన్న చెరువులను సుందరీకరణ చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే అరికపూడి గాంధీ పర్యవేక్షణలో చెరువుల పరిరక్షణ చేపట్టామన్నారు. స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థలు ముందుకొచ్చి సీఎస్ఆర్ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. చెరువు పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో నాయకులు లోకేష్, రమేష్, అనిల్, రాజేష్, సుధాకర్, కెఎస్.బాబు, నాగరాజు తదితురులు పాల్గొన్నారు.

భారతీయులను ఐక్యంగా ఉంచేది రాజ్యాంగమే

- సీపీఎం నేత బీవీ రాఘవులు

రాంనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతీయులు విశ్వమానవులని, వారిని ఒక్కటిగా ఉంచగలిగింది రాజ్యాంగమేనని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకుడు అక్షయకుమార్‌దత్ సంస్మరణ సభను టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాఘవులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడితే, బీజేపీ రాజ్యాంగాన్ని విధ్వంసం చేస్తోందని ఆరోపించారు. ప్రపంచంలో ఎలక్ట్రోరల్ డిక్టేర్‌షిప్ అనే కొత్త సంస్కృతి తెరపైకి వచ్చిందని, ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక నియంతృత్వానికి దారి తీస్తుందన్నారు. లౌకికవాదం, సమాఖ్యవాదం, సామాజిక న్యాయం, సామ్యవాదాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.




చెరువు కట్టపై ఉల్లాసంగా ఆటలాడుతున్న చిన్నారులు

అప్పుడు దుర్గంధం.. ఇప్పుడు ఆహ్లాదం



- ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తున్న బచ్చికుంట చెరువు
- బైరెడ్డి ఫౌండేషన్ సహకారంతో చెరువుకు పునరుజ్జీవం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

చందానగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ డివిజన్ రాజేందర్‌రెడ్డి నగర్ కాలనీలతో పాటు పలు కాలనీల మధ్య సుమారు మూడున్నర ఎకరాల్లో బచ్చికుంట చెరువు విస్తరించి ఉంది. గతంలో ఈ చెరువు ద్వారా సాగు, తాగునీటిని అందించేవారు. అయితే నగర విస్తరణలో భాగంగా అనేక కాలనీలు ఏర్పడడంతో మురుగు నీరు చెరువులోకి వస్తోంది. దీంతో చెరువు కలుషితంగా మారి దుర్వాసన వస్తోంది. పరిసర ప్రాంత కాలనీవాసులు దుర్వాసనను భరించలేక చెరువును శుద్ధి చేయాలని అనేకసార్లు అధికారులకు విజ్ఞప్తి చేశారు. అయినా ఎలాంటి ఫలితం లేదు. ఈ క్రమంలో బైరెడ్డి ఫౌండేషన్ చెరువును దత్తత తీసుకుని సుందరీకరించాలని కోరుతూ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి ఫౌండేషన్ సభ్యులను కోరారు. దీంతో మురికికూపంగా మారిన బచ్చికుంట చెరువు సుందరీకరణ పనులు చేపట్టారు. ఏడాదిలో చెరువు కట్ట పెంచడం, మురుగునీరు రాకుండా చర్యలు తీసుకున్నారు. చెరువు కట్టపై పచ్చని చెట్లు, వాకింగ్ ట్రాక్, క్రీడా సామగ్రిని ఏర్పాటు చేశారు. దీంతో పరిసర ప్రాంత కాలనీవాసులు ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు.

ఆహ్లాదకర వాతావరణం అందుతోంది



చెరువు ప్రాంగణం ఆహ్లాదాన్ని అందిస్తోంది. గతంలో ఇక్కడకి రావాలంటే స్థానికులు భయపడేవారు. ప్రభుత్వం చెరువుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలిస్తున్నాయి. వాకింగ్ ట్రాక్‌ను మరింత అభివృద్ధి చేయాలి.

- శివ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

క్రీడా ప్రాంగణం బాగుంది



చెరువు ప్రాంగణంలో చక్కటి వాతావరణం నెలకొంది. చెట్లు, పూల మొక్కలు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బాగుంది. ప్రభుత్వం అన్ని చెరువులను ఇలాగే అభివృద్ధి చేయాలి.

- శివకుమార్, స్థానికుడు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


5 కే రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


విజేతలకు జ్ఞాపికను అందచేస్తున్న దృశ్యం

మియాపూర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, వ్యాయామం యోగా చేయడంతో శారీరక అలసట తగ్గుతుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలో గల మియాపూర్ సాయిబాలజీ ఇన్ఫ్రా ఇండియా లిమిటెడ్ చైర్మన్ రాంప్రభు ఆధ్వర్యంలో నిర్వహించిన 5 కే రన్ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక శ్రమ పెరిగిపోయిందని, వ్యాయామం, రన్‌ల ద్వారా అలసట తీరుతుందని, ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వయోభేదం లేకుండా వృద్ధులు, చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం వారిలోని ఆశక్తికి నిదర్శనమని కొనియాడారు. ఈ సందర్భంగా రన్‌లో పాల్గొన్న విజేతలకు జ్ఞాపికలను అందచేశారు. కార్యక్రమంలో నాయకులు సుప్రజ ప్రవీణ్, రాచమల్లు నాగేశ్వర్ గౌడ్, బోయిన మహేష్ యాదవ్, చంద్రిక ప్రసాద్ గౌడ్, లక్షణ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పురాణాల విశిష్టతను తెలపాలి



సందేశాన్నిస్తున్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అనంతలక్ష్మి, పాల్గొన్న భక్తులు

మియాపూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచే పిల్లలకు సంస్కృతి సంప్రదాయాలు, పండుగలు, పురాణాల విశిష్టతలను తెలపాలని ప్రముఖ శ్రీ చక్రార్చన ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అనంత లక్ష్మీ పేర్కొన్నారు. మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లో గల శ్రీ ధర్మపురి క్షేత్రంలో జరుగుతున్న వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం ఆధ్యాత్మిక ప్రవచనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మన సాంప్రదాయాలు, శాస్త్రీయతను వివరిస్తూ వారికి మానవ విలువలను తెలపాలని సూచించారు. భారతీయ సంస్కృతికి, సనాతన ధర్మానికి విజ్ఞానానికి దేశానికి భవిష్యత్‌గా నేటి యువత మారాలన్నారు. వస్త్రాధరణ కట్టుబొట్లతో మన విలువలను కాపాడుకుంటూ సంప్రదాయాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో క్షేత్రం నిర్వాహకురాలు సత్యవాణి, సభ్యులు పాల్గొన్నారు.

యాసిడ్ తాగి యువకుడి ఆత్మహత్య


సాయికృష్ణ (ఫైల్)

బిట్స్‌పిలానీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఈ విషాద ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బీజేఆర్ నగర్, జమ్మిగడ్డలో వెంకటేశ్ భార్య, ముగ్గురు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇతని పెద్ద కుమారుడు సాయికృష్ణ(18) తన చిన్న తమ్ముడు రాకేష్‌తో సెల్‌ఫోన్ విషయమై గొడవపడ్డాడు. ఇది తెలిసి తండ్రి ఏ పనీ చేయకుండా ఇంట్లో తిని కూర్చుంటూ గొడవకు దిగుతున్నవా' అని పెద్ద కుమారుడిని మందలిచ్చాడు. దీంతో మనస్తాపం చెందిన సాయికృష్ణ శనివారం సాయంత్రం ఇంట్లో బాత్రూమ్‌ను క్లీనింగ్ చేసే యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే దగ్గరలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



త్రిశూల్ దీక్ష ప్రతిజ్ఞ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కశ్మీర్‌ఫైల్స్ సినిమా నిర్మాత అభిషేక్ అగర్వాల్

హిందూ ధర్మరక్షణకు యువత నడుంబిగించాలి

- కశ్మీర్ ఫైల్స్ చిత్ర నిర్మాత అభిషేక్ అగర్వాల్


సరూర్‌నగర్ వీధుల్లో పదసంచాలన్ చేస్తున్న బజరంగ్‌దళ్ కార్యకర్తలు

ఎల్‌బీనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మరక్షణ కోసం యువత నడుంబిగించాలని కశ్మీర్ ఫైల్స్ చిత్ర నిర్మాత అభిషేక్ అగర్వాల్ పిలుపునిచ్చారు. విశ్వహిందూ పరిషత్ వివేకానంద జిల్లా బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో త్రిశూల్ దీక్ష కార్యక్రమాన్ని ఆదివారం సరూర్‌నగర్ మండల మైదానంలో నిర్వహించారు. అంతకుముందు సరూర్‌నగర్ మండల మైదానం నుంచి బజరంగ్‌దళ్ కార్యకర్తల పదసంచాలన్ ప్రారంభమై మహాలక్ష్మి ఆలయం చౌరస్తా మీదుగా గాంధీబొమ్మ, సరూర్‌నగర్ చౌడీ మీదుగా సరూర్‌నగర్ మండల మైదానం వరకు సాగింది. అనంతరం జరిగిన సభలో అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం కాదు మన హిందూ ధర్మ రక్షణ కోసం ఉద్యమించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. హిందూ ధర్మ రక్షణ కోసం యువత ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యంజీ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన 75 సంవత్సరాలలో దేశంలో మెజారిటీగా ఉన్న హిందువుల జనాభ తగ్గుతూ వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మరో 25 సంవత్సరాలలో హిందువులు మైనారిటీలుగా మారే ప్రమాదం పొంచి ఉన్నదన్నారు. విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ మాట్లాడుతూ మొఘలులను తరిమికొట్టి దేశంలో భగవద్వజాన్ని రెపరెలాడేలా చేసినటువంటి చరిత్ర మనకు ఆదర్శం కావాలన్నారు. భారతదేశం, సనాతన ధర్మం ఏ సవాళ్లను ఎదుర్కుంటుందో వాటికి పరిష్కారం చూపెట్టాల్సినటువంటి గురుతర బాధ్యత మనపై ఉందన్నారు. దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో అక్రమంగా తిష్ట వేసిన బంగ్లాదేశ్ చొరబాటుదారులను వెతికి పట్టుకుని తిప్పిపంపాలని పోలీసులను కోరారు. అక్రమ చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తున్న దేశద్రోహులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సభలో బజరంగ్‌దళ్ తెలంగాణ ప్రాంత కన్వీనర్ శివరాములు, విశ్వహిందూ పరిషత్ భాగ్యలక్ష్మి విభాగ్ ప్రముఖ్ కళ్లెం రాజేందర్‌రెడ్డి, సంఘటన మంత్రి సాయి రాంజీ, వివేకానంద జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, జిల్లా కార్యదర్శి సుధాకర్, జిల్లా బజరంగ్‌దళ్ సంయోజక్ నవారు రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


విశేష పుష్పాలంకరణలో సాయిబాబా

ఘనంగా దత్తజయంతి

ఖైల్‌కాలనీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి పూజలు చండీ హోమాలు, సామూహిక వ్రతాలు, అక్షరాభ్యాసాలతో ఆదివారం దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గురుదత్త జయంతి పర్వదినం సందర్భంగా ఆదివారం భెల్ టౌన్‌షిప్, ఎంఐజీ కాలనీల్లో గల సాయిబాబా ఆలయం, దత్తాత్రేయ ఆలయాల్లో జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంఐజీకాలనీలోని గురు సాయి ఆలయంలో దత్తాత్రేయ స్వామికి విశేష పూజలను నిర్వహించారు. గణపతి హోమం, దత్తహోమం, క్షీరాభిషేకం, సాయినామార్చన, అభిషేకాలు, సామూహిక దత్తవ్రతాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం విష్ణుసహస్రనామపారాయణం, పల్లకీసేవ, సంధ్యాహారతి తదితర పూజలు నిర్వహించారు. భెల్ టౌన్‌షిప్‌లో గల ద్వారకాసాయి ఆలయం, దత్తపీఠంలో జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, భెల్ ఎంఐజీకాలనీలోని గురుసాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి, శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ జి.మోహన్‌గౌడ్, నాయకులు గిరిబాబు, సత్యనారాయణ, సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు పూజలు చేశారు.


గురుసాయి మందిరంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తదితరులు

వైభవంగా రాధామాధవ కల్యాణం


భజన సాంప్రదాయ పద్ధతిలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న భాగవతార్‌లు

ఖైల్‌కాలనీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భజన సాంప్రదాయం నడుమ శ్రీ రాధామాధవ కల్యాణ మహోత్సవం వైభవంగా సాగింది. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థాన దశావతార మండపంలో ఆదివారం హరిహర గానసభ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుగంధ పుష్పాలంకరణలో ఏర్పాటు చేసిన మండపంలో రాధామాధవ చిత్రపటాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, గోపూజ, వసంత మాధవ కలశపూజ, అభిషేకం జరిగాయి. హరిహర గాన సభ కన్వీనర్ చిదంబరం, పలువురు భాగవతార్‌ల భజన సాంప్రదాయ పద్ధతిలో రుక్మిణీ కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం ఆంజనేయ ఉత్సవం వైభవంగా సాగింది.

అయ్యప్ప స్వామి మహాపడిపూజ


మహాపడి పూజలో పాల్గొన్న కొమిరిశెట్టి సాయిబాబా

రాయదుర్గం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గౌలిదొడ్డి గ్రామంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దార్గుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాగం జంగయ్య యాదవ్, దార్గుపల్లి నరేష్, రమేష్ గౌడ్, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ గాలిగోపుర నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్ పరిధిలో ని గంగారంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయ రాజగోపురం నిర్మాణం, ఆలయ అర్చకుల వసతి గృహ నిర్మాణ పనులకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ శంకస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని, నాణ్యమైన నిర్మాణం చేపట్టాలన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, బాలింగ్ గౌతమ్‌గౌడ్ దేవాలయ కమిటీ అధ్యక్షుడు రాధాకృష్ణగౌడ్, సభ్యులు తులసీదాస్, రాజేందర్, రవికుమార్, భగత్,శ్రవణ్, గోపి,శ్రీధర్, దూవల్ యాదవ్, ప్రమోద్ కుమార్, దాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


విజయదుర్గాదేవి అమ్మవారు

మియాపూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మియాపూర్‌లోని విజయదుర్గాదేవి ఆలయంలో గత మూడు రోజులుగా జరిగిన 38వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం శాంతిపూజలతో ముగిశాయి. ఉదయం మంగళవాయిద్యాలతో, నిత్యపూలతో పాటు విశేష పూజలు, అభిషేకాలు, ధ్వజారోహణ నిర్వహించారు. సాయంత్రం నవావరణపూజ, జ్యోతిర్మయి ఆత్మలింగేశ్వరుల దివ్య కల్యాణం, శాంతి మంత్రాలతో ఉత్సవాలు ముగిశాయి.

ప్రభుత్వ భూముల్లో పాగా

● కోర్టు ఆర్డర్ బోర్డు కనబడితే రెవెన్యూ అధికారుల్లో వణుకు
● చర్యలు తీసుకునేందుకు వెనుకంజ

గాజులరామారం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో కోర్టు ఆర్డర్ ఉందంటూ బోర్డు కనిపిస్తే చాలు కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూములు కళ్ల ముందే కబ్జాదారుల పాలై, హారతి కర్పూరంలా కరిగిపోతున్నా అధికారులు, ఉన్నతాధికారులు, నాయకులు చోద్యం చూస్తున్నారు. గాజులరామారం డివిజన్‌లోని దేవేందర్‌నగర్ ప్రభుత్వ సర్వే నంబరు 329లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి కబ్జా చేసి అక్కడ ఒక గది, చుట్టూ కాంపౌండ్ వాల్‌ను నిర్మించాడు. నిఘాకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, కోర్టు ఆర్డర్ ఉందంటూ బోర్డును ఏర్పాటు చేశాడు. దీనిపై ఫిర్యాదులు, పలు పత్రికల్లో వార్తలు ప్రచురితమైనాయి. దీంతో అప్పటి తహసీల్దార్ గౌతమ్ కుమార్ పోలీసుల సహాయంతో అక్రమంగా వెలిసిన వాటిని కూల్చివేశారు. ఆ అధికారి వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లడం, వచ్చిన తహసీల్దార్లు వీటి గురించి పట్టించుకోకపోవడంతో, పక్కా ప్లాన్ ప్రకారం కబ్జాదారు అన్ని పత్రాలు సృష్టించారు. కోర్టు ఆర్డర్ పేరుతో వేరే వ్యక్తి ఈ భూమిలో ఒక గదిని నిర్మించాడు. దీనిపై ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ సిబ్బంది ఆ గదిని కూల్చి వేశారు. ఎన్నిసార్లు కూల్చి వేస్తే అంత గట్టిగా నిలబడుతుందన్న నమ్మకంతో ఆ కబ్జాదారు ఈ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుచేశాడు. సిమెంట్ ఇటుకలు, రింగ్‌లు తయారు చేసే వారికి లీజ్‌కు ఇచ్చినట్లు స్థానికులు తెలుపుతున్నారు.

ఇదిలా ఉండగా మరో వ్యక్తి సుమారు రెండు వందల గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రేకులషెడ్‌ను నిర్మిస్తే అధికారులు కూల్చివేశారు. కూల్చి వేసిన రెండు వారాల్లోనే అక్కడ టీ పాయింట్‌ను, ఆ తర్వాత సిమెంట్ ఇటుకల తయారీదారుకు లీజ్‌కు ఇచ్చాడు. ఎవరైనా ఈ భూమి విషయం అడిగితే, ఇదంతా మా ఆధీనంలోనే ఉన్నది. మీరు ఏమి చేసుకుంటారో చేసుకోమని కబ్జాచేసిన వ్యక్తి సమాధానం చెబుతున్నాడని పలువురు పేర్కొంటున్నారు. ఈ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, ప్రజావసరాల కోసం ఉపయోగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


ప్రభుత్వ భూముల్లో చుట్టూ ఏర్పాటుచేసిన ఫెన్సింగ్


రేకుల షెడ్డు కూల్చివేసిన భూమిలో సిమెంట్ పనులు

చర్యలు తీసుకుంటాం

ఈ భూమిపై ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం. వారు ఏడీ సర్వే నిర్వహించారు. రిపోర్టు రాగానే ప్రభుత్వ భూమి అని తేలితే తప్పకుండా స్వాధీనం చేసుకొని, ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.

\- రెహ్మాన్, కుత్బుల్లాపూర్ తహసీల్దార్

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

● ట్రాన్స్‌లొకేషన్ అంటున్న అధికారులు ● ముక్కలుగా చేసి తీసుకెళ్తున్న వ్యాపారులు

కుత్బుల్లాపూర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి):కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పచ్చని చెట్లపై గొడ్డలి వేటు పడింది. సర్కిల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు రోడ్డుకు ఎడమవైపున పదుల సంఖ్యలో భారీ చెట్లు ఉండేవి. అయితే ఎగ్జిబిషన్ ఏర్పాటుకు ఇవి అడ్డువస్తున్నాయని తొలగించారని స్థానికులు తెలుపుతున్నారు. ఈ విషయంపై హార్టికల్చర్ అధికారిని వివరణ కోరగా ఆ చెట్లను ఇంజనీరింగ్ అధికారులు ట్రాన్స్‌లోకేషన్ చేస్తున్నారని తెలిపారు.

సంఘటన స్థలంలో పరిశీలిస్తే భారీ చెట్ల కలపను ముక్కలుగా చేసి విక్రయించేందుకు వ్యాపారులు తీసుకెళ్లడం కన్పించింది. ఈ విషయమై ఈఈ పాపమ్మను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా స్పందించకపోవడం గమనార్హం. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో చెట్టును తొలగిస్తున్న దృశ్యం


రోడ్డు పక్కన గల చెట్టును నరికివేసిన దృశ్యం


చెట్ల కలపను ట్రాలీలో తరలిస్తున్న కూలీలు


చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కౌన్సిలర్లు, ప్రజలు

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ : ఎమ్మెల్యే

దుండిగల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : భూమి కోసం, భుక్తి కోసం, పెత్తనదారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. దుండిగల్‌లో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో స్ఫూర్తిని పంచిన చాకలి ఐలమ్మ ఆశయసాధనకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, జక్కుల కృష్ణయాదవ్, గోపాల్ రెడ్డి, విజయ శ్రీనివాస్ యాదవ్, ఆనంద్ కుమార్, నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, విజయ గోపాలరావు, రవిందర్ యాదవ్ పాల్గొన్నారు.


హోమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా దత్త జయంతి వేడుకలు

గాజులరామారం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): దత్త జయంతి సందర్భంగా గాజులరామారం డివిజన్ బతుకమ్మబండ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు హోమాలు నిర్వహించారు. అనంతరం పూజారి పరమేశ్వర పంతులు భక్తులతో అభిషేకాలు, అలంకరణలు చేయించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.


రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

తాగునీరు వృథా

షాపూర్‌నగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గాజులరామారం ప్రధాన రహదారిలోని హెచ్‌ఏఎల్ కాలనీ కమాన్ ఎదురుగా రహదారిపై ఉన్న మ్యాన్ హోల్ నుంచి నీరు విడుదల చేసిన ప్రతిసారి లీకేజీ వల్ల రోడ్డుపొడవునా పారడంతో నీరు వృథాగా పోతోంది. ఈ విషయం సిబ్బందికి తెలిసినా పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు మాత్రం ఎక్కడ ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని చెబుతున్నారు. లీకేజీల విషయం తెలిసిన సిబ్బంది అది పెద్ద సమస్య కాదని తేలికగా వదిలేస్తున్నారు. ఇప్పటికైనా నీటివృథాను అరికట్టేందుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


నూతనంగా నియమితులైన బూత్ అధ్యక్షులు

బీజేపీ బూత్ అధ్యక్షుల నియామకం

షాపూర్‌నగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బీజేపీ సాదస్య అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సూరారం డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్‌లోని సాధన స్కూల్ 269 పోలింగ్ బూత్ అధ్యక్షునిగా, 267బూత్ అధ్యక్షునిగా సాయి ముదిరాజ్‌ను మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్‌రెడ్డి నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కేశవ్‌యాదవ్, స్పోర్ట్స్‌సెల్ కన్వీనర్ దీపక్, డివిజన్ అధ్యక్షుడు దుర్యోధనరావులు పాల్గొన్నారు.

కాసాని కృష్ణముదిరాజ్ వర్ధంతి

నిజాంపేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బాచుపల్లి మండల కేంద్రంలో స్వర్గీయ, మాజీ ఎంపీటీసీ కాసాని కృష్ణ ముదిరాజ్ 18వ వర్ధంతి వేడుకలను అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మల్లంపేట, నిజాంపేట, ప్రగతినగర్, బాచుపల్లి ఎంపీటీసీగా పనిచేశారని, రాజీవ్ గాంధీనగర్, సాయినగర్, ఇంద్రానగర్, దేవేందర్‌నగర్‌లకు కాసాని కృష్ణ చేసిన సేవలను మరువలేనివని అభిమానులు గుర్తుచేసుకున్నారు.

రోడ్డు స్థలాన్ని కాపాడాలి..
ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

దుండిగల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజావసరాల కోసం ఉపయోగిస్తున్న రోడ్డును ఆక్రమించిన బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆదివారం దుండిగల్, గండిమైసమ్మ, బౌరంపేటలోని మియాపూర్ నుంచి గండిమైసమ్మకు వచ్చే ప్రధాన రహదారి నుంచి డీఆర్‌కె, ఇంజనీరింగ్ కళాశాల, బౌరంపేట గ్రామానికి వేళ్లే 100ఫీట్ల రహదారిని బీఆర్ఎస్ నాయకులు చౌదరిగారి మహిపాల్‌రెడ్డి, రామ్‌రెడ్డిలు కలిసి ఆక్రమించారని కూన శ్రీశైలంగౌడ్ దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఆ ప్రాంతాన్ని గ్రామస్తులతో కలిసి సందర్శించారు. 2007లో రూ.70 లక్షలతో మండల డెవలప్‌మెంట్ నిధుల ద్వారా రహదారిని నిర్మించడం జరిగిందని, 2009లో రహదారి దెబ్బతినడంతో రూ. 40 లక్షలతో బీటీ రోడ్డును వేయించారన్నారు. రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, బి.కిషోర్‌రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.


ఆక్రమించిన రోడ్డు ఇదే


కబ్జా చేసిన రోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయం : కూన

షాపూర్‌నగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో పలువురు నాయకులు, పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ముఖ్యంగా జగద్గిరిగుట్ట డివిజన్‌లోని రాజీవ్ గృహకల్పలో నెలకొన్న నీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు.


శ్రీశైలంగౌడ్‌కి సమస్యల వినతి పత్రాలు అందజేస్తున్న సంక్షేమ సంఘాల నాయకులు

వాల్వ్‌కు మరమ్మతులు చేయాలి

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తాగునీరు రోడ్డు పాలవుతోంది. జీడిమెట్ల డివిజన్‌లో ఎక్కడో ఒక చోట వాల్వ్ నుంచి లీకేజీ అవుతున్నా సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదు.

దీంతో తాగునీరు వృథాగా పోతుందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీ, ఇండియన్ పెట్రోల్‌బంక్ సమీపంలోని వాల్వ్ నుంచి తాగునీరు సరఫరా చేసినప్పుడు లీకేజీ అవుతుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.


వాల్వ్ నుంచి లీకేజీ అవుతున్న నీరు


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్‌లోని వెంకట్‌రామిరెడ్డినగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ బాసిత్ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకువచ్చి, ఆదుకోవాలని కోరారు. సంఘటనపై విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో విద్యుత్ శాఖ మంజూరు చేసిన రూ.5 లక్షల చెక్కును ఆదివారం జీడిమెట్ల డివిజన్‌లోని దండమూడి ఎన్ క్లేవ్‌లోని ఆయన కార్యాలయంలో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేమారెడ్డి, అసిఫా భాను, ఎండీ అబ్దుల్ అజీజ్, ఎండీ అబ్దుల్ అర్షఫ్‌లు పాల్గొన్నారు.


ప్రార్థనలో పాల్గొన్న శంభీపూర్ కృష్ణ

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

దుండిగల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దుండిగల్ మున్సిపాలిటీ చర్చి గాగిల్లాపూర్‌లోని చైతన్యకాలనీలో హార్మోస్ పెంతుకోస్తు చర్చి పార్క్ సెంటర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్లంపేట కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి కేకును కట్ చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అమరం గోపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, పాస్టర్ వీఎస్‌రావు, సతీష్ క్రైస్తవులు పాల్గొన్నారు.



దప్పికేస్తే ఏ నీరైనా ఓకే..

తాగునీటి కోసం మూగజీవాలకు కూడా వెతుకులాటనే. ఒకప్పుడు చెరువులు, కుంటల్లో నీళ్లు తాగిన మూగజీవులు ప్రస్తుతం చెరువులు, కుంటలు కలుషితం కావడంతో తాగునీరు కరువైంది. ఆదివారం జీడిమెట్ల డివిజన్‌లోని హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో వృథాగా పోతున్న నీటిని తాగుతున్న ఆవు.

\- పేట్‌బషీరాబాద్ (ఆంధ్రజ్యోతి)

ఊడ్చిన చెత్తను తరలించాలి

షాపూర్‌నగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సూరారం, గాజులరామారం డివిజన్‌లలో చెత్త తీసుకువెళ్లే పారిశుధ్య కార్మికులు ఛాయ్ పైసలు ఇవ్వాలని స్థానిక ప్రజలను వేధిస్తున్నారు. ముఖ్యంగా హెచ్ఏఎల్ ఈస్ట్ కాలనీలో కార్మికులు వారానికి ఒకసారి కాలనీ ప్రధాన రహదారిలో చెత్తను ఊడుస్తుంటారు. ఊడ్చిన చెత్తను తరలించకుండా అక్కడే తగులబెట్టడంతో చుట్టుపక్కల పొగవ్యాప్తి చెందుతుంది. రోడ్డుకు ఇరువైపుల శుభ్రం చేయకుండా కాలనీ నాయకులు ఉన్న ఇళ్ల వద్దే ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే ప్రతినెలా వీరు ఛాయ్ పైసలు అంటూ స్థానిక ఇళ్లవారిని వేధిస్తున్నారు. ఇవ్వకపోతే తిట్టుకోవడం, దూషించడం వంటివి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఏదైనా సంతోషంగా ఇస్తే తీసుకోవాలి కానీ బెదిరించి తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఊడ్చిన చెత్తను వేరేచోటకు తరలించాలని, డబ్బుల పేరుతో వేధింపులను మానుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు

కుత్బుల్లాపూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల తీరుపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ చింతల్ ప్రధాన రహదారి పక్కన ఇంటి నిర్మాణానికి అనుమతులు తీసుకుని పూర్తిగా కమర్షియల్ భవన నిర్మాణం చేపడుతున్నారని బీజేపీ నాయకుడు ఆకుల సతీష్ ఫిర్యాదు చేశారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఉందని టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రభావతి బృందం గతంలో తూతూ మంత్రంగా కూల్చివేతలు చేపట్టారు. ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన భవనాన్ని సీజ్ చేశారు. అయినా ఆ భవనంలో నిర్మాణ పనులు పూర్తిచేస్తున్నారు. ఆ భవనంలో ఓ ఆస్పత్రిని ఏర్పాటు చేయబోతున్నట్టు సమాచారం. దీనివల్ల రాబోయే రోజుల్లో ట్రాఫిక్ కష్టాలు మొదలవుతాయని పలువురు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, జిల్లా వైద్యాధికారికి ట్విట్టర్ వేదికగా ఫిర్యాదు చేశారు. ఈ భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, ఫైర్ సేఫ్టీ అనుమతులు లేకుండా అనుమతులు ఎలా ఇస్తారని పరిసర ప్రాంతాల దుకాణదారులు, ఇళ్ల యజమానులు ప్రశ్నిస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ఇవన్నీ పరిశీలించకుండానే అనుమతులు ఇవ్వడంపై పలువురు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి ఆస్పత్రిని ప్రారంభించకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.


టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేసిన భవనం

నిర్వహణ లోపం.. ప్రజలకు శాపం

● మూన్నాళ్ల ముచ్చటగా మోడ్రన్ షీ టాయిలెట్స్
● నిర్వహణ లేక దొంగల పాలైన సామగ్రి
● అధికారుల నిర్లక్ష్యంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా

పేట్‌బషీరాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం వృథా అవుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన మోడ్రన్ షీ టాయిలెట్స్ నిర్వహణ లోపం కారణంగా మూలనపడ్డాయి. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన టాయిలెట్స్ ప్రస్తుతం అధ్వానంగా మారాయి. నగరం సుందరీకరణలో భాగంగా అప్పటి తెలంగాణ ప్రభుత్వం 2019లో ప్రధాన కూడళ్లలో సులబ్ కాంప్లెక్స్‌ను తొలగించి మోడ్రన్ షీ టాయిలెట్స్ అందుబాటులోకి తెచ్చిన విషయం విదితమే. ఇవి ప్రజలకు ఎంతమేర అందుబాటులోకి వచ్చాయన్నది పక్కనపెడితే కాంట్రాక్టర్లకు, అధికారులకు కాసుల కురిపించాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు రూ.10 లక్షలతో కుత్బుల్లాపూర్‌లోని పలు ప్రధాన కూడళ్ల వద్ద షీ టాయిలెట్స్‌ను హట్టహాసంగా ప్రారంభించారు.

మూడునాళ్ల ముచ్చటే

ప్రారంభించిన నాటి నుంచి ఈ మోడ్రన్ షీ టాయిలెట్స్‌కు సరైన నిర్వహణ లేక వెలవెలపోయాయి. దీంతో ఇవి మందు బాబులకు, పలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలు మారాయి. మరికొందరు షీ టాయిలెట్స్‌లో సామాగ్రిని తీసుకెళ్లిపోయారు. ఈ టాయిలెట్స్ నిర్వహణను పట్టించుకునేవారు లేకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా సుచిత్రాలో ఏర్పాటు చేసిన షీ టాయిలెట్స్ త్వరలోనే కనుమరుగుకానున్నాయి. గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల పరిధిలో ఏర్పాటుచేసిన లక్షలు విలువ చేసే షీ టాయిలెట్స్ వృథాగా పడి ఉన్నాయి. దీంతో లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


వినియోగంలో లేని మోడ్రన్ షీ టాయిలెట్స్